# జీవితరంగం

– స్వరాజ్య పద్మజ కుందుర్తి



వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు- కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు



కొండా సత్యవతమ్మగారు

## మహిళా మణులు

ఆదివారం వచ్చిందంటే మా ఉమాక్కకి ఇల్లుసర్దే పనే ... మేమేమో ఎంత బద్ధకంగా రోజు గడిపేద్దామా అని ఆలోచించే వాళ్ళం. నేనైతే sunday is sleepingday అనే సిద్ధాంతాన్ని గట్టిగా నమ్మేదాన్ని. కానీ మా ఉమాక్కదగ్గర ఆ పప్పులేవీ ఉడికేవికావు.

ఆదివారం బద్ధకంగా నిద్ర లేచి, నెమ్మదిగా పళ్ళుతోమి, హాయిగా ఏ ఇడ్లీలో దోసెలో తిని వంటింట్లోంచి ముందు వసారా లోకి వచ్చేసరికి, అలమరల్లోనించి పుస్తకాలన్నీ తీసి గుట్టగా వేసి ఉంచేది. అందులోనించి పురాణాలూ, పాతపుస్తకాలూ ఒక వైపుగానూ, మా క్లాసుపుస్తకాలూ మాచదువులకు ఉపయోగపడేవి ఒకవైపూ పెట్టాలి.

ఇంక ఆతరువాత చాలా కష్టమైన పని ఆంధ్ర ప్రభ, ఆంధ్ర పత్రిక, ఆంధ్ర జ్యోతి లాంటి వీక్లీలూ, రకరకాల నవలలూ ఎంతమందివో ..... యద్ధనపూడి సులోచనారాణీ, కోడూరి కౌసల్యాదేవీ ఇంకా బోలెడుమంది ఇవన్నీ రచయితల వారీగా, వీక్లీలు డేట్లవారీగా సర్దాలి. ఇవికాక, సీరియల్స్ అన్నీ దబ్బనం తో కుట్టి అట్టలు వేసి పేర్లు రాసిన పుస్తకాలు ఎన్నో.

ఇంక చివరగా చందమామ, బాలమిత్ర, బాల, బుజ్జాయి లాంటి పిల్లల పుస్తకాలు. ఇంకా ఇండో సొవియట్ కల్చరల్ ఎక్ఛేంజ్ లో భాగం గా రష్యన్ భాషనుంచి తెలుగులోకి అనువదించిన తాన్యా ఆమె స్నేహితులూ, భూమి బల్లపరుపుగా ఉండేదా?, కణం నుంచీ ..అంతరిక్షం దాకా, కప్పల రష్యా యాత్ర, లాంటి పిల్లల పుస్తకాలు, పదిహేను రోజులకు ఒకసారి వచ్చే సోవియట్ యూనియన్ పుస్తకాలు.

ఇవికాక మా బావగారి దగ్గరినుంచీ అప్పుడప్పుడూ తెచ్చుకున్న రీడర్స్ డైజెస్ట్ పుస్తకాలు కూడా ఉండేవి. ఇన్ని పుస్తకాలు సర్దేసరికి తిన్నదోసెలు అరిగి, మధ్యాహ్నం భోజనం చేశాక కూడా ఇంకా పని మిగిలిపోయి సాయంత్రం అయ్యేది.

కాకపోతే నాకున్న అలవాటు ...సర్దమన్నప్పుడు ఆపని చెయ్యక ప్రతి పుస్తకం ఒకసారి తిరగేసి, కళ్ళని ఆకర్షించిన విషయం ఏదన్నా ఉంటే చదివేదాన్ని. అమ్మమ్మ పుస్తకాలైతే భారత, భాగవత, రామాయణాలు అందులో రకరకాల వాళ్ళు రచించినవి. ఉదా హరణకు ..వాల్మీకి రామాయణం  అన్ని కాండలు, ఆధ్యాత్మ రామాయణం, మొల్ల రామాయణం వాసుదాసుగారి ఆంధ్ర వాల్మీకి రామాయణం ఇలా అన్నమాట.

భగవత్ గీత పుస్తకాలూ వాటికి ఎంతమందో రాసిన వ్యాఖ్యాన గ్రంధాలూ అయితే చెప్పలేం. ఇవేగాక రక రకాల హితచర్య పుస్తకాలు,సతీ హితబోధిని, వివేక వర్ధిని, చింతామణి లాంటి పుస్తకాలు ఎన్నో ఉండేవి.

ఈవిధంగా రెండు మూడు నెల్లకోసారి ఈ పుస్తకాలు సర్దే కార్యక్రమం తప్పించుకోవటానికి వీలులేని పని గా ఉండేది అదేమంటే ఇలా కదిలించి గాలి పారేటట్లు చేసి అలమరలో గమాక్సిన్ చల్లి పెడితే పుస్తకాలు పాడైపోకుండా చెదలు తినకుండా ఉంటాయని హితబోధ చేసేది.

అదుగో... అలా పుస్తకాలు సర్దుతుండగా నాకు దొరికింది, ఒక నాలుగు మడతలు పెట్టిన తెల్లని కాయితం ...ఆ సరికే కొంత ఎర్రడాలుగా మారింది. దాని మీద..... ' మో ‖ క గాంధీ' అని ఇంకుతో రాసిన పెద్ద అక్షరాల సంతకమొకటి కనిపించింది. " అమ్మమ్మోయ్ !!!" అని కేకవేసుకుంటూ అమ్మమ్మ దగ్గరికి వెళ్ళాను. "ఈ కాగితం ఏంటీ? పడెయ్యొచ్చా" అని.

అమ్మమ్మ, ఏమిటీ? ఏది ఇటివ్వు... అని చేతులోకి తీసుకుని ఆనందం గా భక్తిగా కళ్ళకు అద్దుకుని ..." అబ్బ! ఎన్నాళ్ళుగానో వెదుకుతున్నా దీనికోసం. ఏ పుస్తకంలో దొరికింది నీకూ ... " అని భద్రం గా మడతపెట్టి తను అప్పుడు చదువుకుంటున్న ఆధ్యాత్మ రామాయణం లో పేజీల మధ్యన జాగ్రత్తగా పెట్టుకుంది.

"అదేంటి అమ్మమ్మా ... దానిమీద గాంధీ అని రాసుంది అంతే కదా...... అదెవరు రాసిచ్చారూ... ఒకసారి చూపించు" అన్నాను. "అమ్మో... నీకు ఇవ్వను. మళ్ళీ పోతే వెతుక్కోలేను, మీకసలే ఏదెటుపోయేది తెలియదు. వాటి విలువా తెలీదు. ఇవి ఎంతో భద్ర పరచుకోవలసిన సంగతులు" అంది. అప్పటికి ఊరుకున్నాను గానీ దాని వివరమేదో తరువాతైనా కనుక్కోవాలని అనుకుని పన్లో పడిపోయాను అప్పటికి.

"అది మహాత్ముడు స్వయం గా పెట్టిన సంతకం!" చెప్పింది అమ్మమ్మ. అందరం పెందళాడే అన్నాలు తిని, రేడియో పెట్టుకుని మంచాలమీదకు చేరాక, అమ్మమ్మ పక్కలో పడుకుని మధ్యాన్నపు కాగితం గురించి గుర్తుచేసినప్పుడు.

"గాంధీగారికి తెలుగు రాదు కదా!" అన్నాను. "రాక పోవటమేం వచ్చు, ఆయనకు అన్ని భారతీయ భాషలలో సంతకం పెట్టటం వచ్చు" అంది అమ్మమ్మ. "సంతకం వస్తే భాష వచ్చినట్లు కాదుగా... అయినా ఆయన తెలుగులో నీకు తన సంతకం పెట్టిన కాగితం ఎందుకిచ్చాడూ?" అన్నాను.

"అప్పుడు మహిళా జన మహా  సభలు విజయవాడలో జరిగాయి.గుంటూరునించి చాలా మందిమి ఆ సభకు వెళ్ళాం. అక్కడ మాగంటి అన్నపూర్ణమ్మ అనీ అప్పటికి చిన్న పిల్లేలే ...ఒక ఇరవై ఏళ్ళు ఉంటాయేమో మమ్మల్నందరినీ చాలా ఉత్సాహపరిచింది. కాంగ్రెస్ ఫండుకు డబ్బులు చాలా తక్కువగా ఉన్నాయనీ, దానికి గనుక ఐదు రూపాయలకంటే ఎక్కువ ఇచ్చిన వాళ్ళకు స్వయంగా గాంధీగారే తమ చేవ్రాలుతో సంతకం పెట్టి ఇస్తారనీ చెప్పింది."

"నాకయితే సంతకం తీసుకోవాలనీ గాంధీజీని చాలా దగ్గరగా చూడొచ్చనీ ఆశకలిగింది. నేను డబ్బులు తేలేదు ఎలా అని చాలా బాధపడ్డాను. అప్పుడు అక్కయ్య నా భుజం తట్టి, బాధపడకు చిట్టెమ్మా... ఎలాగైనా నీకు గాంధిగారి దర్శనం చేయిస్తాను. నీకు హిందీ బాగా వచ్చుగా, ఆయనతో మాట్లాడుదువుగాని ..." అని, " కంగారు పడకుండా అందరూ ఇక్కడే ఉండండి నేను ఇప్పుడే ఒక గంటలో వచ్చేస్తా" అని సభముందుకు వెళ్ళింది.

ఒక్క అరగంటలోనే తిరిగివచ్చి, "చిట్టెమ్మా రా! తొందరగా" అంటూ నా చేయిపట్టి లాక్కుని వెళ్ళింది. అక్కడ అన్నపుర్ణమ్మ నన్నూ, అక్కయ్యనూ గాంధీగారి దగ్గరకు తీసుకుని వెళ్ళింది.

"అక్కడ  సభకు ఒక ప్రక్కగా ఒక బల్లమీద పరుపువేసి తెల్లని దుప్పటి పరచి ఉంది. దానిమీద ఆశీనులై ఉన్న, కొల్లాయి కట్టిన ఆ దైవ స్వరూపాన్ని ఆనందంగా దర్శించాను. నా కళ్ళు నీళ్ళు చిప్పిల్లి మసకబారు తున్నాయి. రెండు చేతులూ జోడించి నమస్కారం చేశాము."

"సన్నని ధృడమైన గొంతుతో ఆయన, "బేటీ తుం కహాసే ఆయిహో!" అన్నారు. నాకు నోట మాట రావడం లేదు. ఆనందంతో గొంతుక పూడుకు పోయింది. అక్కయ్య వెనుకగా నన్ను తట్టింది. కొంచెం సర్దుకొని, "గుంటూర్ జిలేకే ఏక్ చోటీసీ గావ్ సే ఆయిహు" అన్నాను. క్యా కర్తే హై ఆప్ గావ్ మే" అన్నారాయన. మేము చేసే కార్యక్రమాలు చెప్పాము. అక్కయ్యని పరిచయం చేసి, అక్కయ్య నూలు సేకరించి ఖద్దరు సంఘాలకు ఎలా చేర్చేదీ చెప్పాను."

" ఆయన సంతోషించి, "బహుత్ అచ్చీ బాత్ హై" అన్నారు. అప్పుడు అన్నపూర్ణమ్మ ఫండు కోసం మీ దగ్గరున్న బంగారం తీసి ఇవ్వమని చెప్పింది. మేమిద్దరం వెంటనే మాచేతులకున్న మురుగులు తీసి ఆ మహానుభావుని ముందు పెట్టాము."

" ఆయన సంతోషించి, "అచ్చీ కాం కర్ రహేహై ఆప్ లోగ్.... జీతే రహో" అని దీవించి, ఆయన పక్కనే ఉన్న తెల్లకాగితాల కట్టనుంచి ఒక కాగితం తిసుకుని కలం ఇంకులోముంచి 'మో||క గాంధీ' అని తెలుగులో సంతకం పెట్టి ఇచ్చారు.

"కొత్తగా పెళ్ళయిన ఆ అమ్మాయి కూడా భర్త పరాయి దేశం లో చదువుకుంటున్నా, తన వంటిమీది నగలన్నీ మంగళసూత్రం మాత్రం ఉంచుకుని బాపూ ముందు పెట్టేసింది. ఆతరువాత సాయంత్రం వరకూ ఎంతో మంది ఆడవాళ్ళు ఆయనకు తమ దగ్గరున్న డబ్బూ, నగలూ సమర్పించారుస్వచ్ఛందం గా జాతీయ నిధికోసం."

"మొదటగా సమర్పించిన కొన్నివేలమందికి మాత్రమే అపురూపమైన ఆయన దర్శనం,  సంతకమూ లభించాయి. ఇప్పుడు అర్థమైందా అదెంత విలువైనదో...." అన్నది అమ్మమ్మ. అది నాకెంతో అపురూపంగా అనిపించింది ఆ క్షణం. గాంధిజీతో మాట్లాడి ఆయన జీవించి ఉండగా, ఆయన చెతిమీదుగా సంతకం తీసుకున్న వ్యక్తి నాకు అమ్మమ్మ!

ఈ భావనే ఎంతో గొప్పగా అనిపించింది నాకు. రేపు అమ్మమ్మ ఆధ్యాత్మ రామాయణం లో భద్రంగా ఉన్న దాన్ని ఇంకోసారి తీసి చూడాలి అనుకున్నాను. అలాగే అప్పుడప్పుడూ ఆ కాగితం తీసి చూస్తుండేదాన్ని. అది చూడగానే నాకు స్వయంగా సంతకం పెదుతున్న గాంధీగారి రూపం కళ్ళముందు కదలాడేది.

ఇప్పుదు ఇది రాస్తూ మాత్రం కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాను. ఉమక్కయ్య చెప్పినట్లు అపురూపమైనవి అన్నీ శ్రద్ధగా కాపాడుకోవాలి. చాలా సంవత్సరాల పాటు మాతోనే ఉన్నది ఆ అపురూపమైన వస్తువు మా ఉమాక్క పెళ్ళై అత్తవారింటికి వెళ్ళాక, పుస్తకాలన్నీ కాస్త నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఎప్పుడో సంవత్సరానికో ఆర్నెల్లకో సర్దేవాళ్ళం. ఆ తరువాత చెల్లిపెళ్ళికూడా అయ్యాక, ఆ పుస్తకాలన్నీ పూర్తి నిర్లక్ష్యం చెయబడ్డాయి.

ఆనక ఎంతవెతికినా ఆ పేపరు దొరకలేదు. ఆ పుస్తకాలకి బాగా చెదలు పట్టినాయని పనమ్మాయి చేత శుభ్రం చేయించింది అమ్మ. ఆ సందర్భంలో పోయిందో తెలియదు. అక్కయ్యలు ఎవరిదగ్గరో ఉండి ఉంటుందని అమ్మ చెప్పింది.

ఇప్పుదు వాళ్ళూ లేరు. కారణమేదైతేనేం పెన్నిధిని చెయ్యిజార్చుకున్నాం. ఆప్పటి నా నిర్లక్ష్యానికి ఎన్నివేలసార్లు బాధపడి, క్షమార్పణలు చెప్పుకున్నా ప్రయోజనం లేదు. ఇది నేను చెయ్యిజార్చుకున్న వెలకట్టలేని వస్తువు.

సాయంత్రాలు మాయింటి చుట్టుపక్కల ఉన్న వాళ్ళని ఒక పదిమందిని చేరవేసి పురాణ కాలక్షేపం చెయ్యటం అమ్మమ్మకు అలవాటు. అలానే కొండమ్మ అని ఒకముసలావిడ పిల్లలకు దూరంగా ఒంటరిగా ఉండేది. ఆవిడ ఎప్పుడన్నా పిల్లలకు అమ్మమ్మ చేత ఉత్తరం రాయించుకునేది. రాసిన ఉత్తరాలకు మాత్రం తిరుగు జవాబులు వచ్చేవి కాదు. ఆవిడ కూడా తన క్షేమ సమాచారాలు చెబుతూ వాళ్ళ క్షేమ సమాచారాలు అడుగుతూ ఉత్తరం రాయించేదేకానీ రమ్మని ఎన్నడూ పిలిచేది కాదు.

ఒకరోజు అమ్మమ్మ అదనం గా ఒకేఒక్క వాక్యం రాసింది ఒక్కసారి చూసిపో నాయనా ...అని. వారానికే పెళ్ళాం పిల్లలతో దిగిపోయిన కొడుకుని చూసి చాలా సంతోషించింది ఆవిడ. నా కొడుకు వచ్చాడు చూడమని అందరికీ చూపించి చాలా ఆనందపడింది. తరువాత ఎప్పుడో చెప్పింది అమ్మమ్మ నాతో, నేనే రమ్మని రాసాను అని. అలాచెప్పకుండా ఎందుకు రాసావు అమ్మమ్మా ...అంటే, నవ్వేసి " మనమే కాదే మన చుట్టుపక్కల వాళ్ళు కూడా ఆనందంగా ఉండాలి. చూసావా ఇప్పుడు కొండమ్మ ఎంత సంతోషం గా ఉందో" అన్నది నవ్వేస్తూ.

“అదిసరే... సహాయ నిరాకరణోద్యమం ఆగిపోయింది కదా ఆతరువాత ఏంజరిగిందీ? మీరు ఆతరువాత గాంధీగారి పిలుపుకోసం ఎదురుచూస్తూ ఉన్నారా ఏంచేసారప్పుడూ? " అడిగాను అమ్మమ్మని. “అప్పుడు గాంధీజీ అందరినీ ముందు మీగ్రామ అభివృద్ధీ, వయోజన విద్యా, స్త్రీ విద్య, ఇంకా ఖద్దరు ధరించటం, రాట్నం వడకటం, సమాజ సేవ అంటే మద్యం తాగొద్దని చెప్పటం, ఇంకా దళితుల ఇళ్ళకు వెళ్ళి వారుకూడా చదువుకోవాలనీ, జీవితాలు మెరుగు పరచుకోవాలనీ చెప్పటం, పరిసరాలు పరిశుభ్రం గా ఉంచుకునేలా చూడటం వీటిమీద దృష్టి పెట్టమని ఆదేశించారు. కొంతకాలం అలానే చేశాం."

“పెద్దమ్మమ్మ అప్పట్లో సత్తెనపల్లి దగ్గరా, ఏలూరు దగ్గరా ఖాదీ సంఘాలు ఉండేవి దానికి పల్లెలలోని ఆడవారూ, పొలం పనులు చేయలేని మగవారూ వీళ్ళని ఖాళీగా ఉంచకుండా రాట్నాలూ, ఏకులూ (ఏకులు అంటే గింజతీసిన పత్తి ఉండలు) అవి వారికి సరఫరా చేసి, వారానికి ఒకసారి వాళ్ళు వాటితో వడికిన నూలు దారాన్ని సేకరించి ఆ సంఘాల్లో ఇచ్చేది. దానితో నే పంచెలు, చొక్కాగుడ్డలు,ఇంకా దానికే రంగులద్ది చీరలూ, దుప్పట్లూ నేసేవారు నేతపనివారు."

"బ్రిటీషు వారు ఇక్కడి నుంచి చౌకగా ముడి పత్తి సేకరించి ఓడల్లో వారి దేశానికి పంపి, అక్కడినుండి యంత్రాలపై మిల్లులలో తయారైన బట్టను ఓడల్లో ఇక్కడికి పంపి ఖరీదు ఎక్కువకు అమ్మేవారు. అందువలన ఇక్కడి అనేకమంది నేత పనివారికి పనిలేక చాలా ఇబ్బందులు అనుభవించేవారు. అందుకని గాంధీజీ నేత పనివారికి తిరిగి పనికల్పించాలని, 'మిల్లు గుడ్డ' దానినే 'మల్లు గుడ్డ' అనేవాళ్ళం దానిని ధరించరాదు అని మన మగ్గాలపై నేసిన స్వదేశీ వస్త్రాలే ధరించాలని చెప్పారు."

"అవే కాక ఎక్కువ కాలం మన్నే స్టీలు పాత్రలూ, వంటకు వాడే జర్మన్ సిల్వర్ పాత్రలూ దీనినే పల్లెటూళ్ళలో 'జలమసిలేరు' అనేవాళ్ళు. ఇంకా అందమైన పింగాణీ సామగ్రీ అందుబాటు లోకి వచ్చాయి. దీని వల్ల ఇత్తడి సామానులు తయారు చేసే లోహకారులూ, కుండలు తయారు చేసే కుమ్మర్లకూ జీవనాధారాలు పోయాయి. గాంధీజీ దేశానికి పల్లెటూర్లే పట్టుకొమ్మలు. వివిధ చేతి వృత్తులవారు ఇబ్బంది పడితే పల్లెటూర్లే దీనావస్థలోకి వెళతాయి."

"పల్లెల్లో ఒకరిమీద ఒకరు ఆధారపడి జీవిస్తారు కనుక పల్లెలే పరిపుష్టం కావాలి. పల్లెల్లోని కమ్మర్లు, కుమ్మర్లు, మేదర్లు, సాలీలు, అందరూ వారివారి వృత్తుల వల్ల బాగుపడాలి అని కుటీర పరిశ్రమలను అభివృద్ధిచేయ్యాలని, తద్వారా గ్రామాభివృద్ధి జరగాలని ఆశించారు. అందుకని మా ప్రచారం పల్లెలలోనే జరిగేది."

"ఇదేకాక రోజంతా శ్రమపడిన శ్రమజీవులు సాయంత్రానికి కల్లు తాగేవారు. ఆ కల్లుమీద కూడా పన్ను విధించింది బ్రిటీషు ప్రభుత్వం. అసలే పల్లెల్లోని వారి ఆదాయం చాలా తక్కువ అదికూడా కల్లుకి, మద్యానికి తద్వారా ఆంగ్ల ప్రభుత్వానికి చేరటం, గాంధిజీకి బాధ కలిగించింది. మద్యాన్నుండి వారిని దూరం గా తేవాలని, మద్యం మానమని ప్రచారం చేయాలని ఆయన సూచించారు."

"హరిజనులను దూరంగా పెట్టటంవలన వారు సమాజానికి దూరమవుతున్నారని గాంధీ భావించారు. పైగా రకరకాల ఆశలు కల్పిస్తూ వారిపై కపట ప్రేమను చూపిస్తూ ఆంగ్లప్రభుత్వం మతమార్పిడులను ప్రోత్సహించసాగింది. గాంధీజీ సాటి సమాజం హరిజనులను అక్కున చేర్చుకోవాలనీ, వారికీ విద్యా ఉద్యోగాలు లాంటి వసతులు కల్పించాలనీ, ముఖ్యం గా దేవాలయ ప్రవేశం కల్పించాలనీ సంకల్పించారు."

"ఈ కార్యక్రమాలలో నేనూ, అక్కయ్యా పాలుపంచుకుంటూ మా కాలాన్ని వృధాచేయకుండా ఎప్పుడూ ఆ పనుల్లో తలమునకలుగా ఉండేవాళ్ళం. ఆసమయం లోనే మా పొలాన్ని కొద్దికొద్దిగా సాగుకు అనుకూలం గా మార్చుకుంటూ దాదాపు పాతికెకరాల భూమిని సాగుకు అనుగుణం గా తయారు చేసుకున్నాము. చెరువు క్రింది మాగాణి ఒక ఐదెకరాలు వరి పండేది. మిగిలిన ఇరవై ఎకరాలు మెట్'ట పంటలు పండేవి."

"పశువులకూ, పాడిపంటలకూ లోటులేకుండా జీవితం చాలా సాఫీగా సాగుతున్నది. హరిజనోద్ధరణ లో భాగంగా హరిజనులను దేవాలయ ప్రవేశం చేయించాలని గాంధీజీ ఆదేశం మేరకు మన వావిలాల గోపాలక్రిష్ణయ్య ఇంకొంత మంది రాజకీయ నాయకులూ ఆరోజు మాగ్రామానికి వస్తామని కబురు పెట్టారు."

"పెద్దమ్మమ్మ ఈ కార్యక్రమానికి మా ఊరిలో ఏర్పాట్లు ప్రారంభించింది. కానీ ఊర్లోఉన్న బ్రాహ్మణ కుటుంబాలూ, మోతుబరులూ ఇందుకు వప్పుకోలేదు. మా సవతి తమ్ముడు అందరికీ ఇటువంటి కార్యక్రమాలు జరిగితే ఊరికి అరిష్టం వస్తుందనీ, ఊరు నాశన మవుతుందనీ, పైగా ఇంక హరిజనులు మన మాట వినరనీ అందరికీ నూరి పోసాడు."

"రాఘవయ్య అన్నయ్యా మిగిలిన రైతులూ పెద్దమ్మమ్మ దగ్గరకు వచ్చి, ఇటువంటి వాటిలో తలదూర్చొద్దనీ, ప్రశాంతంగా ఉన్న ఊరిలో గొడవలు పెట్టొద్దనీ, ఇటువంటివి జరిగితే ఇంక హరిజనులు బ్రాహ్మలకూ, రెడ్డి, కమ్మకులాలకూ విలువివ్వరనీ నచ్చచెప్పే ప్రయత్నం చేసారు. కానీ పెద్దమ్మమ్మ వినలేదు."

"సాక్షాత్తూ ఆదిశంకరులే మనుషులంతా ఒక్కటే నని గ్రహించి కడపటివానికి సాష్టాంగ పడలేదా? వాళ్ళు ఆలయాలకు వచ్చి దేవుడిని దర్శించుకొని రెండుచేతులెత్తి మొక్కినంత మాత్రాన దేవుడు అపవిత్రమై పోతాడా? ఎట్టిపరిస్థితులలోనూ రేపు హరిజనుల ఆలయ ప్రవేశం జరుగుతుందని ఖరాఖండి గా చెప్పింది."

"ఊరి పెద్దలందరికీ బాగా కోపమొచ్చింది. మేము ఊళ్ళో ఉండగా ఇటువంటి అప్రాచ్యపు పనులు జరగనివ్వం. రేపు జరగబోయే గొడవలకు బాధ్యత మీదే అవుతుందని గట్టిగా చెప్పి వెళ్ళారు. అటుపక్క మా పొలం చేసే మాదిగ సుబ్బడు, యానాది ఎంకటి, మాల హనుమంతు లాంటి వాళ్ళు ఆలయ ప్రవేశానికి చాలా ఉత్సాహం గా ఉన్నారు."

"పేటనుంచీ ఇంకా ఊళ్ళో చెట్లనుంచీ కొబ్బరి కాయలు  బస్తాలకు  సేకరించి పెట్టుకున్నారు. ఆడవాళ్ళు పొలం గట్లవెంట బంతిపూలు, ములిగోరింట పూలూ సేకరించి, కనకాంబరాలూ, మరువమూ కలిపి మాలలల్లి సిద్ధం గా ఉంచుకున్నారు."

"వాళ్ళ ఇళ్ళలో ఉత్సాహఉరకలేస్తుంటే.... మోతుబరుల ఇళ్ళలో ఉక్రోషం, ఉడుకుమోతుతనం ఆగ్రహమై బుసలు కొడుతోంది. తమముందు తలగుడ్డతీసి చంకలోపెట్టుకొని తలవంచుకుని వెళ్ళే హరిజనులు ఆలయ ప్రవేశం చేస్తే దేవుడివంకతో భయభక్తులు లేకుండా ఊళ్ళో సంచరిస్తారనే అనుమానం మొదలయింది మొత్తానికి ఆరాత్రి ఊరిలో భయం గొలిపే నిశ్శబ్దమేదో జడలు విప్పి తిరుగుతోంది."

"నేను నెమ్మదిగా అక్కయ్యతో ...."అక్కయ్యా!! ఆడవాళ్ళం...అందులోనూ అసరా లేనివాళ్ళం. ఊరంతాఒకవైపూ మనమొకవైపూనూ కొంచెం ఆలోచించు" అన్నాను. అక్కయ్య ఆవేశం గా "ఏంజరుగుతుంది చిట్టెమ్మా మహా అయితే ప్రాణం పోతుంది అంతేగా ...పోనీ ఒకమంచిపనికోసం ప్రాణాలు ఇస్తే మాత్రమేం" అన్నది.

"ఆ అపశకునం మాటకి నాకు పై ప్రాణాలు పైన్నే పోయాయి. అంత ఆవేశం అక్కయ్యలో ఎప్పుడూ చూడలేదు. మారు మాట్లాడే ధైర్యం లేక నిశ్శబ్దంగా ఉన్నాను. ఆ రాత్రి ఇద్దరికీ నిద్దరే లేదమ్మా. ఏం జరుగుతుందో అని నాకూ రేపటి కార్యక్రమం ఎలా జరుగుతుందో అని అక్కయ్యకూ ...భారంగా చెప్పింది అమ్మమ్మ."

నాకు నిద్రలో కూడా అప్పటి విధానాలకు వ్యతిరేకం గా జుట్టు పెంచుకుని ముడేసుకుని తెల్లని ఖాదీ చీరలో, అంతకంటే తెల్లని మేనిరంగుతో నిలువెత్తు దీపశిఖలా వెలుగుతున్న పెద్దమ్మమ్మే కనిపించసాగింది. "సరాజ్యం "...అంటూపిలిచి ప్రేమగా తల నిమురుతున్నట్లే ఉంది. నేను కలవరిస్తూ అటూఇటూ మసలుతుంటే చిన్నమ్మమ్మ నన్నుపొదువుకుంటూ అక్కను తలుచుకుంటూ తాను ఏడవటం నాకింకా గుర్తుంది.

*(కొనసాగింపు వచ్చే సంచికలో..!)*

Post your comments